క్లుప్తంగా

17 నుంచి సంతానలక్ష్మి బ్రహ్మోత్సవాలు

ఉదయగిరి : పట్టణంలో కొలువైన సంతానలక్ష్మి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ హోమాలు, కలశస్థాపన, అంకురార్పాణ, 18న విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు, కుంకుమార్చన, 19న విశేషాలంకరణ, పసుపు, కుంకుమ పూజలు, సంతానం లేని వారు వరపడుట, సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం, 20న శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీనివాస కల్యాణ మహోత్సవం, ప్రత్యేక పూజలు, 21న అమ్మవారికి ధనలక్ష్మి అలంకరణ, బండ్లు తిప్పుట, పొంగళ్ల కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

పనికి తగ్గ కూలి వచ్చేలా చూడాలి



మర్రిపాడు : ఉపాధి హామీ పథకం కూలీలకు పనికి తగ్గ కూలి అందేలా చూడాలని ఏపీఓ వెంకటనారాయణ అన్నారు. మండల ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏపీఓ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 24 పంచాయతీల్లో ఎన్ఆర్ఈజీఎస్ పనులు చేపట్టాలని, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పనులు కల్పించాలన్నారు. పని చేసే ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ తదితర మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. అలాగే ఏదైనా అనుకోకుండా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స కోసం కిట్‌లను కూడా అందుబాటులో ఉంచుతామని వివరించారు.

ఎన్ఎంఎస్‌కు మోడల్ స్కూల్ విద్యార్థినులు

దుత్తలూరు : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు దుత్తలూరు ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జి.సైమన్‌రావు తెలిపారు. 8వ తరగతి చదువుతున్న జి.మధుప్రియ, బి.లక్ష్మీపూజిత, షేక్.అఫ్రీన్ ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ప్రతిభ చాటి స్కాలర్‌షిప్‌కు అర్హత పొందారని తెలియజేశారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థినులను అభినందించారు.

పౌష్టికాహార అందజేత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాల్లో శిక్షణ పొందుతున్న 600 మంది క్రీడాకారులకు పౌష్టికాహారాన్ని వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు మాట్లాడారు. బెజవాడ సునీల్‌రెడ్డి సౌజన్యంతో పౌష్టికాహారాన్ని అందజేశామని వివరించారు. డాక్టర్ విజయశంకర్, అసోసియేషన్ సభ్యులు నరేంద్రరెడ్డి, జయదేవ్, డాక్టర్ అంకిరెడ్డి, రాఘవేంద్రశెట్టి, రవిచంద్ర, గఫార్, సుబ్బరామిరెడ్డి, లోకేష్, రామ్మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

8న బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను ఈ నెల ఎనిమిదిన నిర్వహించనున్నామని చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక కార్యదర్శి యజ్ఞావఝుల శేషగిరీశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ సినీ కవి భువనచంద్ర అధ్యక్షత వహించనున్నారని, ప్రముఖ గాయని ఎస్పీ శైలజ, నటుడు శుభలేఖ సుధాకర్ పాల్గొననున్నారని చెప్పారు. వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నామని, భారీగా తరలిరావాలని కోరారు.

సింహవాహనంపై ఆంజనేయుడు



నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న హనుమజ్జయంతి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారు సింహవాహనంపై దర్శనమిచ్చారు. మూలవర్లకు అభిషేకాలు, పూజలు తదితరాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయకర్తలుగా దూపాటి సురేష్, సూరాయపాళెం మధుసూదన్ వ్యవహరించారు. ఈఓ దర్గయ్య, మహేష్ పర్యవేక్షించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బీచ్‌లోని వ్యర్థాలను తొలగిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు



మొక్కలు నాటుతున్న అంగన్‌వాడీలు

ఇందుకూరుపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని 10వ ఆంధ్ర నావెల్ యూనిట్ ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కమాండర్ గణేష్ గొడంగవే అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మైపాడు బీచ్‌లో 10వ ఆంధ్ర నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఎన్‌సీసీ క్యాడెట్లు బీచ్‌లోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యం బాగుంటుందన్నారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఆహారం తీసుకోవడం ద్వారా పశు, మత్స్య సంపద ఇబ్బంది పడుతాయన్నారు. వాటిని తిన్న మనకు జీర్ణకోశ సంబంధిత వ్యాధులు తలెత్తుతాయన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్లు గుండాల నరేంద్రబాబు, కోటపురి ఆరోరా, నాగరాజు విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ మనుగడకు మొక్కలే జీవనాధారం

మానవ మనగడకు మొక్కలే జీవనాధారమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గుడి మంజుల పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గంగపట్నంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కల నుంచే మనిషికి అవసరమైన గాలి, ఆహారం వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని బాధ్యతగా చేపట్టాలన్నారు. పిల్లలు సైతం బాల్యం నుంచే ఈ దిశగా అడుగులు వేసేలా చూడాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీకార్యకర్తలు చాముండేశ్వరి, స్వరూప, షాహీన, తదితరులు పాల్గొన్నారు.

కోవూరు: పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధించగలదని ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని గ్రంథాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల సంరక్షణ, మొక్కలు నాటడంతో పాటు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే అనేక రకాల జీవజాతులు అంతరించిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థులు గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి మంజులత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆంజనేయునికి పల్లకిసేవ



ముత్తుకూరు: స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పల్లకిసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆంజనేయస్వామి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తగా గౌడ సంఘం వ్యవహరించింది.

నా కుమారుడి ప్రాణాలకు రక్షణ కల్పించండి



విలేకరులతో మాట్లాడుతున్న అరుణ

విడవలూరు: మైనర్ అయిన తన కుమారుడు గౌతమ్‌కు టీడీపీ నాయకుల నుంచి ప్రాణహాని ఉందని, తన బిడ్డ ప్రాణాలను కాపాడాలని విడవలూరులోని చెముకులవారి వీధికి చెందిన బొబ్బారెడ్డి అరుణ కోరారు. బుధవారం ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. గత నెలలో ఎన్నికలకు ముందు విడవలూరుకు చెందిన మాతూరు శ్రీనివాసులరెడ్డి, కప్పిరి శ్రీను, పులి శ్రీకాంత్, సుబ్బు, నాని అకారణంగా తన కుమారుడు గౌతమ్‌పై దాడి చేసి కొట్టారని తెలిపారు. మళ్లీ ఈ నెల 3న టీడీపీ కార్యాలయానికి వెళ్లిన తన కొడుకు మెడకు వైరుచుట్టి మారోమారు దాడికి పాల్పడ్డారని చెప్పారు. తన కొడుకు తప్పించుకుని ఇంటికి వచ్చి జరిగిన విషయాన్ని తనకు తెలియజేశాడన్నారు. తన కొడుకును వెంట పెట్టుకుని అడిగేందుకు టీడీపీ కార్యాలయం వద్దకు వెళ్లగా తన కళ్ల ముందే మరోసారి దాడి చేశారని తెలిపారు. దీంతో తన కొడుకు చేసేదేమి లేక ప్రాణాలు కాపాడుకునేందుకు శ్రీకాంత్ అనే వ్యక్తిపై దాడి చేశాడే తప్ప, ఎవ్వరిని చంపే ఉద్దేశం తనకు లేదన్నారు. టీడీపీకి చెందిన సత్యవోలు సత్యంరెడ్డితో తన కుమారుడు సన్నిహితంగా ఉంటున్నాడని తెలిపారు. ఆ కోపంతో అదే పార్టీకి చెందిన మాతూరు శ్రీనివాసుల రెడ్డి పార్టీ కార్యాలయంలోకి రావద్దని, పార్టీకి సంబంధించిన మరే ఇతర విషయాల్లో జోక్యం చేసుకోవద్దని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఈ రోజు టీడీపీ అధికారంలోకి వచ్చిందని, మైనర్ అయిన తన బిడ్డపై రెండు కేసులు పెట్టించి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడన్నారు. మంగళవారం అర్ధరాత్రి చెముకుల చైతన్య 50 మందితో కలిసి తన ఇంటిలోకి వచ్చి ఒంటరిగా ఉంటున్న తనతో పాటు తన కూతురిపైన దాడికి దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబానికి మాతూరు శ్రీనివాసులరెడ్డి, చెముకుల చైతన్య నుంచి ప్రాణహాని ఉందని ఆరోపించారు. తమకు గ్రామంలో ఎవ్వరూ లేరని, ఒంటరిగా జీవనం సాగిస్తున్న తమ కుటుంబంపై కక్ష సాధింపు చర్యలకు దిగడం తగదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

వినాయకుడికి విశేష పూజలు



మనుబోలు: మండలంలోని కొండూరుసత్రంలోని వినాయకుడి ఆలయంలో బుధవారం పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. వినాయకుడు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా పసుపులేటి శ్రీనివాసులు, రమాదేవి దంపతులు వ్యవహరించారు.

ముగిసిన వసంతోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వసంతోత్సవాలు బుధవారంతో ముగిశాయి. నవకలశ స్నపన తిరుమంజనం, వసంతోత్సవం, దివ్యప్రబంధగోష్ఠి, ఆస్థాన సేవ తదితరాలను నిర్వహించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

దోమల నివారణతో మలేరియా దూరం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

కొడవలూరు: దోమల నివారణతో మలేరియాను దూరం చేయవచ్చని కొడవలూరు వైద్యాధికారి ఎం రామకృష్ణ పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా కొడవలూరులో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకాటుతో మలేరియా, డెంగీ, బోధకాలు వంటి వ్యాధులు సోకుతాయని వివరించారు. ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను నివారించవచ్చన్నారు. రాత్రి వేళల్లో దోమ కాటుకు గురికాకుండా దోమతెరలు వినియోగించడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సోమశేఖర్, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



ర్యాలీ ప్రారంభిస్తున్న సీఈఓ జీజే రావు

- పోర్టు సీఈఓ జీజే రావు

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టులో పర్యావరణ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నామని సీఈఓ జీజే రావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అడ్మిన్ బిల్డింగ్ నుంచి డాక్టర్ అబ్దుల్ కలాం పార్కు వరకు బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. పర్యావరణాన్ని కాపాడేందుకు పోర్టు పరిసరాల్లో పచ్చని వనాలు ఏర్పాటు చేశామన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి పరిరక్షణకు బాధ్యతగా పనిచేస్తున్నామన్నారు. అనంతరం ఉద్యోగులతోపాటు 500 మొక్కలు నాటారు. అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేశారు. సీఓఓ రాజన్ బాబు, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, ఈహెచ్‌ఎస్ హెడ్ వేణుగోపాల్‌రెడ్డి, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ జి.వేణుగోపాల్, మృత్యుంజయరామ్ పాల్గొన్నారు.

ముత్తుకూరులో ఓ మోస్తరు వర్షం



ముత్తుకూరు: మండలంలో బుధవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. మేఘాలు దట్టంగా అలుముకుని ఉరుములు, మెరుపులతో కొద్దిసేపు వర్షం కురిసింది. వర్షంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో కొద్దిరోజులుగా వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు కాస్త ఊరట పొందారు.

ఇంటర్‌లో చేరికకు 12న కౌన్సెలింగ్

కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురం ఈఎంఆర్ఎస్ (ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్)లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరికకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 12వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ టి.విష్ణుప్రియ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో బాలురకు 5, బైపీసీలో బాలురకు 13, హెచ్ఈపీలో బాలురకు 15, బాలికలకు సంబంధించి 12 ఖాళీల భర్తీకి ఈ కౌన్సెలింగ్ జరుగుతోందన్నారు. విద్యార్థుల పదో తరగతిలో మెరిట్ ప్రాతిపదికన సీట్లు భర్తీ చేస్తామన్నారు. దీనికి యానాది, ఎరుకుల, నక్కల, సుగాలి విద్యార్థులే అర్హులన్నారు. కౌన్సెలింగ్ సమయంలో ప్రతి విద్యార్థి వారి ఆధార్, తల్లిదండ్రుల ఆధార్, రేషన్‌కార్డు, కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణపత్రాలు మూడేసి జిరాక్స్ కాపీలతోపాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఆరోజు ఉదయం 10 గంటలకు చంద్రశేఖరపురం ఈఎంఆర్ఎస్‌లో హాజరుకావాలని కోరారు.

కేన్సర్ నియంత్రణకు కృషి



మాట్లాడుతున్న వైద్యులు

నెల్లూరు(అర్బన్): ముందుగా గుర్తించడం ద్వారా కేన్సర్‌ను నయం చేయొచ్చని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (పెద్దాస్పత్రి) సూపరింటెండెంట్ సిద్ధా నాయక్ పేర్కొన్నారు. కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం కోసం కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. ప్రస్తుతం రెండో దశలో జిల్లా స్థాయిలోని సెకండరీ హెల్త్ స్పెషలిస్ట్ డెంటల్ డాక్టర్లు, గైనకాలజిస్టులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. పీహెచ్‌సీ డాక్టర్లు, ఎమ్మెల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలకు మూడో దశలో శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. పరీక్షల్లో గుర్తించిన కేన్సర్ బాధితులను రోగ నిర్ధారణ కోసం మెడికల్ కళాశాలలకు పంపి.. అవసరమైన వారికి చికిత్సను అందించనున్నామని వెల్లడించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి రమేష్‌నాథ్, ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, ఎన్సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుధీర్‌కుమార్, డాక్టర్లు చంద్రశేఖర్, కాలేషాబాషా తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



కొడవలూరులో సుబ్బారావుకు సత్కారం



యల్లాయపాళెంలో ...

కొడవలూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని రెడ్‌క్రాస్ సభ్యుడు సుబ్బారావు పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కొడవలూరు గ్రంథాలయంలో బుధవారం ఆయన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తాను ఇప్పటి వరకు 32 సార్లు రక్తదానం చేశానని, ఇప్పటికీ ఎంతో ఆరోగ్యకరంగా ఉన్నానని తెలిపారు. ఎంతో మందికి అత్యవసరాల్లో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడానని చెప్పారు. రక్తదానం ఒక బృహత్తర సహాయ కార్యక్రమంగా అభివర్ణించారు. ఆరోగ్యవంతులు ప్రతిమూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. అపోహలు వీడి ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణాలు నిలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి రాజేశ్వరి పాల్గొన్నారు.

- వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా యల్లాయపాళెం గ్రంథాలయంలో రిసోర్స్‌పర్సన్ నెల్లూరు శరణ్య విద్యార్థులతో నీతి కథలు చెప్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరం ఎంతో దోహదపడుతుందన్నారు. గ్రంథాలయాధికారి సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

కంది పంట సాగు లాభదాయకం



సాగులో ఉన్న కంది పంట(ఫైల్)

పొదలకూరు: కంది పంట సాగు లాభదాయకమని, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు అందుకు అనుకూలంగా ఉన్నాయని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తున్నారు. మండలంలో మెట్ట పొలాలు అధికంగా ఉన్నాయి. కందితో పాటు మినుము, పచ్చిశనగ, పెసర, తదితర మెట్ట పంటలు ఎక్కువగా సాగుచేస్తుంటారు. ఇటీవల తరచుగా కురుస్తున్న వర్షాలతో నేలలో తేమశాతం ఉన్నందున ఖరీఫ్‌లో కంది పంట సాగు చేసుకోవచ్చునని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సాగు విధానం ఇలా..

కంది సాగు చేసే రైతులు వరుస, వరుసకు 4 మీటర్ల ఎడమ ఉండేలా విత్తనాలు విత్తుకోవాలి. దీనివల్ల అక్టోబరు, నవంబరు మాసాల్లో కురిసే వర్షాలకు కంది సాళ్ల మధ్య మినుము, పెసర, పచ్చిశనగ, తదితర పంటలను అంతర పంటలుగా సాగు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. కందిని ఏకపంటగా కూడా విత్తుకోవచ్చు. వరుస, వరుసకు మధ్య 2 మీటర్ల ఎడం ఉండేలా చూసుకోవాలి.

అంతర్ పంటగా కంది

పెసర, మినుము, పచ్చిశనగ పంటల్లో అంతర పంటగానూ కంది సాగు చేపట్టవచ్చు. అధిక వర్షాలు కురిసి పెసర, మినుము, పచ్చిశనగ పంటలు దెబ్బతిన్నా కంది చేతికి అందుతుంది. తద్వారా రైతులు నష్టపోయే అవకాశం ఉండదు. ఒకే పొలంలో ఖరీఫ్‌లో కంది, రబీలో పెసర, మినుము పంటలను సాగు చేయడం ద్వారా ఆదాయం పెరుగుతుంది.